క్లుప్తంగా

నేడు రేషన్‌కార్డుల పంపిణీ

చిలుకూరు : మండలంలోని పలువురు లబ్ధిదారులకు మంజూరైన నూతన రేషన్ కార్డులను స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ ధృవకుమార్ ఆదివారం వెల్లడించారు. మండల వ్యాప్తంగా 1200రేషన్‌కార్డులు మంజూరైనట్లు తెలిపారు.

హైకోర్టు పీపీని కలిసిన నియోజకవర్గ నాయకులు



హైకోర్ట్ పీపీ నాగేశ్వరరావుతో నాయకులు

హుజూర్‌నగర్ : పట్టణానికి చెందిన ఎస్సీసెల్, మాల మహానాడు, బీసీ సంఘం నియోజకవర్గ ముఖ్య నాయకులు ఆదివారం హైకోర్ట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు సమస్యల గురించి పీపీకి విన్నవించినట్లు తెలిపారు. కలిసిన వారిలో కోలపూడి దయాకర్, దగ్గుపాటి బాబురావు, శ్రీనాథ్, చంటి, వసంత్‌కుమార్, ఉపేందర్, సురేష్ ఉన్నారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

మునగాల : యువత, విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ బి.ప్రవీణ్‌కుమార్ కోరారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యువత సరైన దారిలో నడిచేలా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఖాళీగా తిరగడం మూలంగా వారి ఆలోచనలు చెడు వ్యసనాలపై పడే అవకాశాలు ఉంటాయని, అటువంటి సమయంలో బాధ్యతలను పెంచే ఆలోచనలపై దృష్టి మరల్చేలా చేయాలని అన్నారు. గంజాయి, మత్తు పదార్థాలు, మద్యం, డ్రగ్స్, ఆన్‌లైన్ గేమింగ్‌లకు అలవాటు పడితే కుటుంబాలు వీధిన పడతాయని ఆయన హెచ్చరించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



అధ్యక్షుడిగా ఎన్నికైన రవికి నియామకపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

నేరేడుచర్ల : మండల కేంద్రంలో మండల ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ అధ్యక్షుడిగా మచ్చ రవి, ఉపాధ్యక్షులుగా బెంజిమన్, ఇంజమూరి శంకర్, లతీఫ్, ప్రధాన కార్యదర్శిగా శివకోటి నర్సింహాచారితో పాటు కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా సలహాదారులు వుద్దోజు శ్రీనివాసచారి, గౌరవ అధ్యక్షుడు చందమళ్ల శ్రీరాములు, ఇంజమూరి వెంకటేశ్వర్లు, మధుబాబు, సురేష్, సతీష్ తదితరులున్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో తేజ విద్యార్థుల ప్రతిభ



విజేతలుగా నిలిచిన విద్యార్థులు

కోదాడ : హైదరాబాద్‌లో తెలంగాణ చెస్ అకాడమి ఆధ్వర్యంలో వివిధ కేటగిరిలో నిర్వహించిన చెస్ పోటీల్లో కోదాడలోని తేజ విద్యాలయానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానంలో నిలిచినట్లు ఆ పాఠశాల నిర్వాహకులు తెలిపారు. అండర్-13 విభాగంలో యోగిత, అండర్ -11 విభాగంలో అద్వైతలు ద్వితీయ స్థానంలో నిలిచారని తెలిపారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ ఉస్తేల రమాసోమిరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం



మృతుడి కుటుంబానికి రూ.లక్ష డిపాజిట్ పత్రాలు అందజేస్తున్న స్నేహితులు

మఠంపల్లి : మండలంలోని వరదాపురం గ్రామానికి చెందిన బాల్యమిత్రుడు బచ్చలకూరి వెంకటేశ్వర్లు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. వెంకటేశ్వర్లుతో పాటు 2003-2004లో రాజాపేట గురుకుల పాఠశాలలో పదోతరగతి చదివిన స్నేహితులు ఆదివారం గ్రామానికి వచ్చి వెంకటేశ్వర్లు చిత్రపటానికి నివాళులర్పించి ఆయన ఇద్దరు పిల్లల పేరుతో పోస్టాఫీస్‌లో రూ.లక్ష డిపాజిట్ చేశారు. ఆ డిపాజిట్ పత్రాలను పిల్లలు, మృతుడి సోదరుడు బచ్చలకూరి బాబుకు అందజేశారు.

నిలిచిన 'మనఊరు-మనబడి' పనులు

- ఏడాదిన్నరగా పూర్తిగాని తరగతి గదుల నిర్మాణం
- నిధులు మంజూరు కాకపోవడంతో మధ్యలోనే వదిలేసిన కాంట్రాక్టర్
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



చిలుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిలిచిన భవన నిర్మాణ పనులు



పాలెంఅన్నారం ప్రాథమిక పాఠశాలలో పిల్లర్ల దశలో ఉన్న భవనం పనులు

చిలుకూరు : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి గత ప్రభుత్వం మన ఊరు- మన బడి పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో శిథిలావస్థలకు చేరిన తరగతి గదులను గుర్తించి వాటిని కూల్చివేయించి నూతన తరగతి గదుల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో అధికారులు నూతన భవనాలకు టెండర్లు పిలిచి పనులను కాంట్రాక్టర్లకు అప్పగించారు. దీంతో వారు పనులు ప్రారంభించిన కొద్దిరోజులకే గదుల నిర్మాణాల పనులు పూర్తి చేయకుండా మధ్యలోనే వదిలేయడంతో పనులు ఎక్కడిక్కడే నిలిచిపోయాయి. ప్రభుత్వం పనులకు సంబంధించిన నిధులను సకాలంలో మంజూరు చేయకపోవడంతో మిగిలిన పనులు చేసేందుకు సంబంధిత కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరకుండా పోయింది. మండల పరిధిలోని చిలుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నూతన గదుల నిర్మాణ పనులు స్లాబ్ వరకు పూర్తిచేసి వదిలేశారు. అదే విధంగా మండలంలోని పాలెంఅన్నారం ప్రాథమిక పాఠశాలలో గదుల నిర్మాణం పిల్లర్ల దశలోనే నిలిచిపోయాయి. జెర్రిపోతులగూడెంలో 80శాతం పనులు పూర్తిచేసి చివరి దశలో వదిలేశారు. సీత్లాతండా ప్రాథమిక పాఠశాలలో గది నిర్మాణ పనులు అసలు ప్రారంభమే కాలేదు. రామాపురం అంబేద్కర్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో స్లాబ్ దశ వరకు పనులు పూర్తి చేశారు. అనంతరం ఆ పనులు నిలిచిపోయాయి. కొండాపురం ప్రాథమిక పాఠశాలలో గది నిర్మాణ పనులు బేస్‌మెంట్ లెవల్‌లోనే ఆగిపోయాయి. బేతవోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 90శాతం పనులు పూర్తయ్యాయి. మండల వ్యాప్తంగా 10పాఠశాలలకు నిధులు మంజూరుకాగా 7పాఠశాలల్లో పనులు వివిధ దశల్లో నిలిచిపోయాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పాఠశాలల్లో నిలిచిన మన ఊరు- మన బడి నూతన భవన నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేయించి సకాలంలో పూర్తిచేయించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



పాఠశాలలో నూతన గదుల నిర్మాణ పనులు నిలిచిపోయిన మాట వాస్తవమే. నిలిచిన భవన నిర్మాణ పనులు విషయాన్ని ప్రభుత్వం దృష్టికి, ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లాము. సాధ్యమైనంత త్వరగా నూతన భవన నిర్మాణ పనులు జరిగేలా చూసి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తాను.

– గురవయ్య, ఎంఈఓ, చిలుకూరు

ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలి



మొక్కలు నాటుతున్న ఆయుష్ యోగా శిక్షకుడు రామాంజిరెడ్డి, మాజీ కౌన్సిలర్ నాగేశ్వరరావు

హుజూర్‌నగర్ : ప్రతిఒక్కరూ మొక్కలు పెంచి పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలని వందేమాతరం ఫౌండేషన్ సభ్యుడు, ఆయుష్ యోగా శిక్షకుడు బేతం రామాంజిరెడ్డి అన్నారు. ఆదివారం మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్‌కలాం వర్ధంతి సందర్భంగా పట్టణంలోని 28 వార్డుల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతిఒక్కరూ ఒక మొక్క నాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. మాజీ కౌన్సిలర్ ఓరుగంటి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రోజురోజుకు క్షీణించిపోతున్న పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. మీ ఇంటితో పాటు మీ పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా 150మొక్కలు నాటాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానికులు భానోత్ ప్రసాద్, చందా ప్రసాద్, ఓరుగంటి రాజ్యలక్ష్మి, నూకల లక్ష్మి, మట్టపల్లి రజిత, ఓరుగంటి హైమారాణి, సావిత్రి, జానకి పాల్గొన్నారు.

శిథిల భవనం కూల్చివేత



భవనాన్ని కూల్చివేయిస్తున్న పంచాయతీ కార్యదర్శి

సాక్షి ఎఫెక్ట్..

మునగాల : మండల కేంద్రంలోని గణపవరం రోడ్డులో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకొని కూలేందుకు సిద్ధంగా ఉండడంతో ఈ నెల 10న 'బడులు ఇలా.. చదువుకునేది ఎలా' అనే శీర్షికన సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. అందుకుగాను అధికార యంత్రాంగం స్పందించింది. వెంటనే పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ నేతృత్వంలో శిథిల భవనాన్ని జేసీబీ సాయంతో ఆదివారం కూల్చివేశారు.

హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరాములు

మునగాల : ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సీపీఎం మండల కార్యదర్శి బుర్రి శ్రీరాములు అన్నారు. ఆదివారం మండలంలోని మాధవరంలో దేశగాని వీరబాబు అధ్యక్షతన జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో నరేంద్రమోదీ సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని, అక్రమ సంపాదన వెలికితీస్తామని, సంవత్సరానికి ప్రతి కుటుంబానికి రూ.15లక్షలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగసంస్థలను నేడు పూర్తిగా కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా చట్టాలను మారుస్తుందని అన్నారు. బీజేపీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని ప్రైవేట్‌పరం చేసి వ్యవసాయ విధానాలను అమలు చేయాలని చూసిందన్నారు. స్వామినాథన్ కమీషన్ సిఫారసులను అమలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు బచ్చలకూర స్వరాజ్యం, మండల కమిటీ సభ్యులు బట్టు నాగయ్య, ఆర్.రామకృష్ణారెడ్డి, శాఖా కార్యదర్శులు వీరబాబు, వీరస్వామి, శేఖర్‌రెడ్డి, జానకిరెడ్డి, నారాయణరెడ్డి, సుందరయ్య, కిశోర్ పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు



జాన్‌పహాడ్ రోడ్డులో తోపుడు బండ్లను తొలగిస్తున్న పోలీసులు

సాక్షి ఎఫెక్ట్..

నేరేడుచర్ల : మండల కేంద్రంలోని జాతీయ రహదారి, జాన్‌పహాడ్ రోడ్డుల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ రవీందర్‌నాయక్ అన్నారు. ఆదివారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన ‘ట్రాఫిక్ సమస్యలతో అవస్థలు’ అనే కథనానికి స్పందించిన పోలీస్ యంత్రాంగం ఎస్‌ఐ ఆధ్వర్యంలో ఆయా రోడ్లలోని తోపుడు బండ్లను తొలగించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. రోడ్ల మధ్యలోకి వాహనాలు నిలిపినా, తోపుడు బండ్ల వ్యాపారం చేసినా, దుకాణాల యాజమానులు సామగ్రి పెట్టినా జరిమానా విధించడంతో పాటు కేసులు నమోదు చేస్తామన్నారు. ట్రాఫిక్ రూల్స్‌ను పాటించి ప్రమాదాల నివారణలో భాగస్వాములు కావాలన్నారు.

ఘనంగా రిటైర్డ్ ఉద్యోగుల జన్మదిన వేడుకలు



రిటైర్డ్ ఉద్యోగులను సన్మానిస్తున్న సంఘం నాయకులు

నేరేడుచర్ల : మండలంలోని పెన్షనర్ల భవన్‌లో ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల జన్మదిన వేడుకలను ఆ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నెలలో జన్మించిన రిటైర్డ్ ఉద్యోగులు నిమ్మల పాండురంగయ్య, గుండ్రెడ్డి సైదిరెడ్డి, శ్రీరాములు, స్వరాజ్యలక్ష్మి, అందే అరుణ, పాతకోటి లచ్చయ్యను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చింతకుంట్ల పూర్ణచంద్రారెడ్డి, సత్యనారాయణ, బుద్దరెడ్డి, రామస్వామి, సుందరయ్య,, రంగారెడ్డి, కలమ్మ, కాంతమ్మ, కృష్ణారావు తదితరులున్నారు.

ఉపాధ్యాయుల పదోన్నతులపై హర్షం

చిలుకూరు : ఉపాధ్యాయుల పదోన్నతులకు సీఎం రేవంత్‌రెడ్డి అంగీకరించడం హర్షణీయమని ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బంధం వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బదిలీలతో కూడిన పదోన్నతులు చేపట్టాలని, 2024లో ప్రమోషన్ పొందిన సీనియర్ ఉపాధ్యాయులు సుదూర ప్రాంతాల్లో పనిచేస్తూ చాలా ఇబ్బందులు పడుతున్నారని, వారితో పాటు 317 జీఓలో బాధిత ఉపాధ్యాయులకు కూడా జీరో సర్వీస్‌తో కూడిన బదిలీలు చేయాలని, గతంలో పదోన్నతులు పొందిన ఎస్జీటీలకు జరిగిన అన్యాయాలను సరిచేస్తూ బదిలీలు చేపట్టాలని కోరారు. బీఈడీ చేసిన ఎస్జీటీలకు కూడా ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్ ప్రమోషన్లకు అర్హులుగా ప్రకటించాలన్నారు.

మాదిగ జాతిని జాగృతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

మోతె : మాదిగ జాతిని జాగృతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ బచ్చలకూరి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సబ్బండ కులాలకు సేవ చేసిన మాదిగ జాతిని జాగృతం చేయడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎమ్మార్పీఎస్‌ను గ్రామగ్రామాన బలోపేతం చేసి పార్టీలకు అతీతంగా జాతిని నిర్మించాలన్నారు. గ్రామగ్రామాన ఎమ్మార్పీఎస్ గద్దెల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి ఏపూరి రాజుమాదిగ, జిల్లా కార్యదర్శి మారపంగు రామాంజి, జిల్లా ఉపాధ్యక్షుడు జిల్లపెల్లి లెనిన్, ఎంజెఎఫ్ జిల్లా అధికార ప్రతినిధి పల్లెల లక్ష్మణ్, ఎంఎఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కాంపాటి వెంకన్నమాదిగ, ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ బొడ్డు కుటుంబరావు, పల్లెల రాము, చిరంజీవి, విజయ్, మధు, ప్రభంజన్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి



వరినాట్లు వేసి నిరసన తెలుపుతున్న మహిళలు

మోతె : ఇటీవల కురిసిన వర్షాలకు మండల వ్యాప్తంగా గుంతలమయంగా మారిన అంతర్గత రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని వ్యవసాయ కార్మిక శాఖ మహిళా కూలీల జిల్లా కన్వీనర్ జంపాల స్వరాజ్యం అన్నారు. ఆదివారం మండలంలోని సిరికొండ గ్రామంలో ఆమె పర్యటించి మాట్లాడారు. జిల్లా స్థాయి అధికారులు చొరవ చూపి గ్రామాల్లో అంతర్గత రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. అనంతరం సిరికొండ గ్రామంలో బురదమయమైన వీధిలో రోడ్డుపై వరినాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. ఆమె వెంట రామసాని నర్సమ్మ, కాంపాటి మల్లేశ్వరి, నాగమ్మ, పద్మ, పూజల నాగమ్మ, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంకు నివాళి



నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కోదాడ : దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాంను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని పలువురు అన్నారు. ఆదివారం పట్టణంలో అబ్దుల్‌కలాం వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక గాంధీపార్కులో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎస్‌కె.నయీం, సంగిశెట్టి గోపాల్, కర్ల సుందర్‌బాబు, మేదర లలిత, అబ్బు, ఉపేందర్, కోదాడ మండల విద్యాధికారి షేక్ సలీంషరీఫ్, వెంకటనారాయణ, రాజశేఖర్, సత్యనారాయణ, బండారు శ్రీనివాసరావు, గుడుగుంట్ల సాయి, నరేందర్ పాల్గొన్నారు.

పీఎస్‌పీ సంస్థ సహకారం సద్వినియోగం చేసుకోవాలి

నడిగూడెం : పీఎస్‌పీ సంస్థ సహకారం సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ మండల బ్లాక్ కోఆర్డినేటర్ దున్నా నాగరాజు కోరారు. ఇటీవల ఆగ్రో ఫారెస్ట్రీ కార్యక్రమంలో భాగంగా పీఎస్‌పీ సంస్థ ఆధ్వర్యంలో రామాపురం, ఎకలాస్‌ఖాన్‌పేట తండా, తెల్లబల్లి, కరివిరాల, వెంకట్రాంపురం, చెన్నకేశ్వాపురం గ్రామాలకు చెందిన పలువురు రైతులకు ఉచితంగా మామిడి మొక్కలను పంపిణీ చేశారు. ఆదివారం రామాపురం, ఎఖలాస్‌ఖాన్‌పేట తండాలో మామిడి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో రైతులు మొగలగాని విజయలక్ష్మి, శ్రీనివాస్, వస్రాం, వీరన్న, దేవలా, భద్రు, లోక్యా, పాపయ్య, నర్సయ్య, అప్పారావు పాల్గొన్నారు.

మన్‌కీ బాత్‌తో దేశభక్తి పెంపొందుతుంది



గరిడేపల్లి : మన్‌కీబాత్‌ను వీక్షిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు శ్రీలతారెడ్డి, నాయకులు

గరిడేపల్లి : ప్రధాని నరేంద్రమోదీ మన్‌కీ బాత్ కార్యక్రమంతో దేశంలోని ప్రతి పౌరుడిలో దేశభక్తి పెంపొందుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలతారెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని రాయినిగూడెంలో 291వ బూత్‌లో నిర్వహించిన మన్‌కీ బాత్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బూత్‌స్థాయి కార్యకర్తలు బీజేపీ ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కుక్కడపు వెంకటేశ్వర్లు, రామినేని కృష్ణయ్య, ఆకుల భిక్షమయ్య, చిత్తలూరి సోమయ్య, జెనెగల శ్రీనివాస్, సుందరి రమేష్, కాంపాటి రాజు, మేకపోతుల వీరప్రసాద్, నర్సింగ్ నాగసైదులు, నర్సింగ్ వినయ్, కోల గోపి, బంటు అంజయ్య, కీత రమేష్, కుక్కడపు లక్ష్మయ్య, జెల్ల సత్యనారాయణ, మండవ సత్యం పాల్గొన్నారు.

మట్టిలో మాణిక్యాలను గుర్తించేదే మన్‌కీ బాత్

హుజూర్‌నగర్ : దేశవ్యాప్తంగా ఉన్న మట్టిలో మాణిక్యాలను గుర్తించేదే మన్‌కీ బాత్ కార్యక్రమం అని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొండ హరీష్‌గౌడ్ అన్నారు. ఆదివారం పట్టణంలో ప్రధాని నరేంద్రమోదీ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని నాయకులతో కలిసి వీక్షించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సీహెచ్ ఉమామహేశ్వరరావు, డి.రామరాజు, గోపి, విజయ్, పుల్లమ్మ, సుజాత, శశికళ, హర్షిణి, హనీశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

వైశ్య రాజకీయ రణభేరిని విజయవంతం చేయాలి



చిలుకూరు : మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

చిలుకూరు : హైదరాబాద్‌లో వచ్చే నెల 3న వైశ్య వికాస వేదిక ఆధ్వర్యంలో వైశ్యుల ఆత్మగౌరవం-హక్కుల సాధనకై చేపట్టిన వైశ్య రాజకీయ రణభేరి మహాసభలో ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు వెంపటి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన ఆర్యవైశ్య సంఘం మండల సభలో ఆయన మాట్లాడారు. మేమెంతో మాకంత అనే నినాదంతో ముందుకు సాగుతున్నామన్నారు. జనాభా దామాషా ప్రకారం స్థానిక ఎన్నికల్లో వైశ్యులకు వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామస్థాయిలో తమకు సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనకు చేపట్టిన రణభేరిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి నూనె నాగన్న, ఆర్యవైశ్య సంఘం జిల్లా, మండల నాయకులు ఓరుగంటి ప్రభాకర్, గరిణె ప్రభాకర్, గరిణె శేషగిరిరావు, ఈగె శ్రీను, వెంపటి రమణ, ఓరుగంటి కిట్టు, వెంకటనారాయణ, అంజి, వెంకన్న పాల్గొన్నారు.

మునగాల : వచ్చే నెల 3న హైదరాబాద్‌లో నిర్వహించే ఆర్యవైశ్య రణభేరి మహాసభలో ఆర్యవైశ్యులు పాల్గొని జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంపటి వెంకటేశ్వరరావు కోరారు. ఆదివారం మండల కేంద్రంలో గల వాసవీభవన్‌లో నిర్వహించిన ఆర్యవైశ్య సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ మహాసభలో ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొంటారని, ఈ మహాసభను విజయవంతం చేసేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని కోరారు. సమావేశంలో ఆర్యవైశ్య సంఘం మండల శాఖ అధ్యక్షుడు పి.శ్రీనివాస్, మండల ఆర్యవైశ్య పెద్దలు, వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

నడిగూడెం : వచ్చే నెల 3న హైదరాబాద్‌లో ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాజకీయ శంఖారావాన్ని విజయవంతం చేయాలని ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు వెంపటి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని శ్రీకోదండరామస్వామి ఆలయంలో సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎంవీ.రమణారావు, రేపాల పురుషోత్తం, గజ్జి అప్పారావు, జిల్లా అదనపు కార్యదర్శి నూనె నాగన్న, చెన్నూరు వెంకటేశ్వర్లు, సోమ శ్రీను, అర్వపల్లి హనుమంతరావు, సూర్యప్రకాష రావు, వంగవీటి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకానికి నిధులు మంజూరు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

మునగాల : సాగర్ ఎడమకాల్వపై నిర్మించిన పలు ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, జయభారత్ లిఫ్ట్ ఇరిగేషన్ చైర్మన్ మేదరమెట్ల వెంకటేశ్వరరావు కోరారు. ఆదివారం మండలంలోని కొక్కిరేణి పరిధిలో ఉన్న జయభారత్ లిఫ్ట్ ఇరిగేషన్‌కు ఆయన నీటిని విడుదల చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయ సాగు కోసం నీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వం ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు నిధులు మంజూరు చేయకపోవడంతో రైతాంగం ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 25ఏళ్లుగా ఎత్తిపోతల పథకాలలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందిని యథావిధిగా కొనసాగించాలని, వారికి పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఆయన కోరారు. సమావేశంలో గ్రామ మాజీ సర్పంచ్ వక్కంతుల కోటేశ్వరరావు, గరిడేపల్లి మండలం వెలిదెండ గ్రామ మాజీ సర్పంచ్ ఆదూరి కోటయ్య, కొక్కిరేణి గ్రామ మాజీ సర్పంచ్ రావులపెంట వెంకన్న, మాజీ ఎంపీటీసీ ఎర్రం శ్రీనివాసరెడ్డి, సీపీఎం గ్రామ కార్యదర్శి నందిగామ సైదులు, సింగిల్‌విండో డైరెక్టర్ నిడిగొండ శంభయ్య, గ్రామపెద్దలు చనగాని సాంబయ్య, వట్టెపు చినసైదులు, కామళ్ల ప్రసాద్, మిల్లు వెంకయ్య, బండి లచ్చయ్య, లిఫ్ట్ ఇరిగేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో భగవద్గీత సత్సంగం



హషికేశదాస్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి సత్రంలో ఆదివారం భగవద్గీత సత్సంగం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ మందిరం ప్రవచన వక్త, భగవద్గీత ప్రచారకుడు ప్రభూజి హషికేశదాస్ పాల్గొని భగవద్గీత రెండవ అధ్యాయంపై ప్రసంగించారు. ఆత్మసాక్షాత్కారాన్ని పొందే అద్భుతమైన మార్గాన్ని భగవద్గీత మనకి ప్రసాదిస్తుందన్నారు. లౌకికమైన చింత, భ్రాంతి, దుఃఖముల నుంచి అలౌకికమైన చింతన, సత్యం సుఖం వైపుకి భగవద్గీత జ్ఞానం మనల్ని తీసుకెళ్తుందని అందరూ తెలుసుకోవాలన్నారు. ఆత్మజ్ఞానంతో జీవితంలో సుఖసంతోషాలు సులువుగా వస్తాయన్నారు. ఈ సందర్భంగా అన్నమయ్య భజన మండలి వారి భజనలు పలువురిని ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రచారకులు హషికేశదాస్, ప్రసాదం పంపిణీకి సహకరించిన కుక్కడపు సైదులును శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో నిర్వాహకులు మట్టపల్లి శ్రీమన్నారాయణ, ఓరుగంటి నాగేశ్వరరావు, నర్సింగ్ వెంకటేశ్వర్లు, మట్టపల్లి వెంకటనారాయణ, కేశగాని నాగేశ్వరరావు, రమేష్‌ప్రభు, మట్టపల్లి లక్ష్మీనారాయణ, వీరవల్లి కొండలు, భోగ్గవరపు రాధ, మట్టపల్లి సత్యనారాయణ, పెండ్యాల నాని, బుర్ర శ్రీను, వెంకటలక్ష్మి, ఉప్పల సతీష్, గుండా రమేష్, నర్సింహారావు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

కల్యాణ మండపం నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాత బండారు వెంకటేశ్వర్లు

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీకోదండరామస్వామి ఆలయానికి అనుబంధంగా నిర్మిస్తున్న కల్యాణ మండపం నిర్మాణానికి ఆదివారం నాగిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన బండారు వెంకటేశ్వర్లు పద్మావతి దంపతులు ఆలయ కమిటీ సభ్యులకు రూ.1,01,116ల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా దాతను ఆలయ కమిటీ అభినందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ భవురిశెట్టి వెంకటరత్నం, కార్యదర్శి కొండా వెంకటసత్యనారాయణగుప్త, కోశాధికారి వందనపు సూర్యప్రకాశరావు, ఉపాధ్యక్షుడు చెన్నూరు బాబు, దివ్వెల శ్రీనివాసరావు, గజ్జి అప్పారావు, వందనపు మోహన్‌రావు, వందనపు దయాకర్, భోనగిరి ఉపేందర్, ఎస్‌ఎస్.మూర్తి, వందనపు చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు.

చేయూత పెన్షన్లు ఇవ్వాలి

నేరేడుచర్ల : రాష్ట్ర ప్రభుత్వం చేయూత పెన్షన్లను తక్షణమే ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి నెలా 1నుంచి 5వతేదీ వరకు చేయూత పింఛన్లు ఇస్తామని చెప్పి, నేడు నూతనంగా ఐరిష్ విధానంతో ఇస్తామని ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు.

అసంపూర్తిగా సీసీరోడ్డు నిర్మాణం

మునగాల : మండల కేంద్రంలో కొక్కిరేణి వెళ్లే మార్గంలో సుమారు 800మీటర్ల పొడవులో ఏర్పాటు చేసిన సీసీరోడ్డు నిర్మాణంలో భాగంగా కాంట్రాక్టర్ సుమారు 50మీటర్లు వదలివేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని డీవైఎఫ్‌ఐ మండల కార్యదర్శి గడ్డం వినోద్ అన్నారు. ఆదివారం అసంపూర్తిగా ఉన్న రోడ్డుపై నిల్చుని నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. ఆయన వెంట దేవరం శ్యాంసుందర్‌రెడ్డి, సందీప్ ఉన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

హుజూర్‌నగర్ : పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సంఘటన ఆదివారం పట్టణంలో చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ బలరామిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణం నుంచి మాధవరాయినిగూడెంకు వెళ్లే దారిలో స్వర్ణ వేదిక ఫంక్షన్ హాల్ సమీపంలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో అక్కడికి వెళ్లి ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని, వారి నుంచి రూ.4,500ల నగదు, 4 మోటార్ సైకిళ్లు, 6సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.